Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

31-01-2026

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 35 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## 60 లక్షల కిలోల కల్తీ నెయ్యితో

20 కోట్ల లడ్డూలు తయారు చేశారు

వైసీపీ పై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం



02

## ఒకటో తారీఖు రావాల్సిందే

కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్



02

## వారణాసి రిలీజ్ డేట్ ఫిక్స్

కటించిన రాజమౌళి



02



# రేవంత్ నయా రికార్డ్



.. హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ పొందిన తొలి సీఎం

- మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ తరగతులకు హాజరు

రేపు హైదరాబాద్ కు సీఎం

హైదరాబాద్, మహా :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని 'కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో లీడర్‌షిప్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి కోర్సు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. జనవరి 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైనట్లు టీచర్స్, తోటి విద్యార్థుల నుంచి ఎంతో నేర్చున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

# మళ్ళీ కాంగ్రెస్సే

ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే.. రిపీటే.. బీఆర్ఎస్ కు మళ్ళీ గుండుసున్నా



ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ 2026 సర్వేలో స్పష్టం

రెండేళ్ళలో పెరిగిన కాంగ్రెస్ ఓటు బ్యాంకు

తెలంగాణలో పెరిగిన రేవంత్ పరపతి

ఎదుగూబొదుగూ లేని బీఆర్ఎస్

తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిన పోల్ వార్

ఏపీలో ఎదురులేని కూటమి.. బాబుపై జనం భరోసా

(హైదరాబాద్ -మహా)

ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో మళ్ళీ కాంగ్రెస్సే అధికారంలోకి రానుంది. గత ఓటుబ్యాంకు నిలుపుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ రెండేళ్ళలో తన పరపతిని మరింత పెంచుకుంది. రేవంత్ నాయకత్వానికి ప్రజలు జయహో అంటుండగా, ఓటు షేర్ గత ఏడాది కంటే 2శాతానికి పైగా పెరిగింది. ఇక బీఆర్ఎస్ ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. ఇపుడు లోక్ సభ ఎన్నికలు జరిగితే ప్రజలు మళ్ళీ గుండుసున్నా ఇస్తారని తేల్చేసింది. బీజేపీ కూడా ఏమంత ఇంప్రూవ్ కాకపోగా, క్షీణించిందని, ఇపుడు లోక్ సభ ఎన్నికలు జరిగితే ఉన్న సీట్లలో రెండు తగ్గి.. కాంగ్రెస్ కు పెరుగుతాయని చెప్పేసింది. గత రెండేళ్ళుగా ఆర్భాటాలకు, ఆడంబరాలకు పోకుండా ప్రజల కోణంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పై ప్రజలు నమ్మకం పెంచుకున్నారు. విధానం లేకుండా, బురదజల్లడమే విధానంగా దూసుకుపోతున్న బీఆర్ఎస్ వైపు ప్రజలు చూడడం లేదని, గత జ్ఞాపకాలు ప్రజల మది నుండి పోలేదని ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో తేల్చేసింది.

**రేవంత్ పై ప్రజల నమ్మకం**

ఇండియా టుడే సీ వోటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే జనవరి 2026 ఫలితాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులపై మరోసారి ఆసక్తికర వివరాలు వెల్లడించాయి. ఈ సర్వే డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026 వరకు నిర్వహించబడింది. ఇది దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజల మనస్తత్వాన్ని అంచనా వేస్తుంది, అయితే రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థాయి అంచనాలను కూడా సూచిస్తుంది. తెలంగాణలో రాజకీయం ఇప్పుడు రెండు జాతీయ పార్టీల మధ్యే నడుస్తోంది... గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్లో ఇప్పుడు స్వల్ప మార్పులు కనిపిస్తున్నాయి. 2024లో కాంగ్రెస్, బీజేపీ చెరి 8 సీట్లు గెలిచాయి. కానీ ఇప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ వోట్ల శాతం రెండు శాతం వరకూ పెరిగి 8 నుండి 10వరకు సీట్లు అదనంగా రావచ్చు. బీజేపీ వోటు శాతం అలాగే ఉండి, ఒకటో రెండో తగ్గొచ్చు లేదా సేమ్ ఫలితం రావచ్చు. 6 నుండి 8 వరకు రావొచ్చు. బీఆర్ఎస్ పరిస్థితి మాత్రం పెద్ద మార్పు లేదు... వస్తే ఒక సీటు రావచ్చు. లేకుంటే గత ఫలితాలే రిపీటు. గుండుసున్నా.

మిగతా 2లో



# జజ్జనకర జనారే మేడారం జనహోరే

గద్దెలపై సమ్మక్కసారలమ్మలు

తల్లుల స్మరణతో మార్మోగిన ఊరు

వేగంగా దర్శనం..

భక్తుల హర్షం

ఈసారి జాతర వేరే లెక్క అంటున్న పబ్లిక్

మేడారం, మహా

తెలంగాణ కుంభమేళా, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం జనహోరుతో పులకించింది. జంపన్నవాగులో జలకాలాడిన జనం భక్తిపారవశ్యంతో శివమూగారు. గద్దెపై తల్లులు కొలువు తీరడంతో సమ్మక్క, సారలమ్మ నామ స్మరణ తో మేడారం మార్మోగుతోంది .మేడారంలో ఎటు చూసినా జనమే. జంపన్న వాగు లో పుణ్య స్నానాలు చేసి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. జంపన్న వాగు పరిసరాలు, గద్దెల ప్రాంతంలో ఇసుక వేస్తే రాలనంత జనం ఉన్నారు. వన దేవతల నామస్మరణలు.. మరోవైపు శివసత్తుల పూనకాలతో జాతర ప్రాంగణం హోరెత్తుతోంది.

తెలంగాణలోని అరణ్య ప్రాంతంలో జరుగుతున్న మహాజాతర మూడో రోజూ భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. అమ్మవార్ల జాతరతో మేడారం పరిసర ప్రాంతాలు పూర్తిగా పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ప్రతి వైపు భక్తుల నినాదాలు, భక్తి గీతాలు వినిపిస్తున్నాయి. భక్తులు తెల్లవారుజామునే జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ, వనదేవతల గద్దెల వద్ద అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు.

మిగతా 2లో

దానం అనర్హత పిటిషన్ పై

# స్పీకర్ విచారణ





హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్

వాదనలను వినిపించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేపాడి కౌశిక్ రెడ్డి

ఫిబ్రవరి 20 కి విచారణ వాయిదా కోరిన బిజెఎల్పీనేత ఏలేటి

ఫిబ్రవరి 18 కి వాయిదా వేసిన స్పీకర్

02

# పోలీసులకు కౌశిక్ రెడ్డి క్షమాపణలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరి వైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు.



ఇరిగేషన్ శాఖను బీఆర్ఎస్

# సర్వనాశనం చేసింది

.. మంత్రి ఉత్తమ్ ధ్వజం



**ఢిల్లీ, మహా :**

ఇరిగేషన్ శాఖను బీఆర్ఎస్ సర్వనాశనం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఢిల్లీ సీడబ్ల్యూసీ మీటింగ్ గురించి మాజీ మంత్రి హరీశ్‌రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని హితవు పలికారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని సవాల్ విసిరారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల హక్కులను వదులుకునే ప్రస్తక్తే లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీ సీడబ్ల్యూసీ మీటింగ్‌లో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం నల్లమల ప్రాజెక్టుపై చర్చకు తెలంగాణ అధికారులు ఒప్పుకోలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. పోలవరం నల్లమల సాగర్‌కు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఈరోజు సమావేశంలో చెప్పారని ప్రస్తావించారు. గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో ఇరిగేషన్‌కు రూ.1.84 లక్షల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీటి వాటాల పంచాయితీ వల్ల అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల్లో నష్టం జరిగిందని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ జలాల తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు వదులుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాటం చేస్తున్నామని వివరించారు. నీటి వాటాల కోసం అన్ని రకాల పోరాటాలు చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం బనకచర్లపై కోర్టులో సూట్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



కేంద్ర జల వివాదాల పరిష్కార

# కమిటీ భేటీ

12 అంశాలు ప్రస్తావించిన తెలంగాణ

**ఢిల్లీ, మహా :**

తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలపై ఏర్పాటైన కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశం ఢిల్లీలోని కేంద్ర జలసంఘం కార్యాలయంలో జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన దాదాపు రెండు గంటల పాటు కొనసాగింది. సమావేశానికి సీడబ్ల్యూసీ అధికారులు, కృష్ణా నది యాజమాన్య మండలి , గోదావరి నది యాజమాన్య మండలి , నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ తరఫున 12 అంశాలను చర్చకు ప్రతిపాదించినట్లు తెలిపారు. పోలవరం, నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను అజెండాలో చేర్చవద్దని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి అనేక సమస్యలు, వివాదాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన అజెండాను వెల్లడించలేదని రాహుల్ బొజ్జ తెలిపారు.

# మళ్ళీ కాంగ్రెస్సే



(మొదటి పేజీ తరువాయి)

**ఇదీ ఓట్ల లెక్క**

**కాంగ్రెస్ :** 2024లో 40.1% ఉండగా, ఇప్పుడు 41% కి చేరింది... రాష్ట్రంలో అధికారంలో ఉండటం, రైతు భరోసా, ఫ్రీ పవర్, సిలిండర్ ధర తగ్గింపు, ధాన్యానికి బోనస్ ధర, సన్నబియ్యం, ఫ్రీ రవాణా, ఆడంబరాలకు పోకుండా ప్రజలకు అందుబాటులో ఉండడం వంటివి ఇందుకు కారణాలు.

**బిజెపి :** బిజెపి 2024లో 35% ఉండగా, ఇప్పుడు 33% కి తగ్గింది. సీట్ల పరంగా కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇస్తోంది. మోదీనే భారతీయ జనతాపార్టీ బలం. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని సర్వే స్పష్టం చేసింది.

**బీఆర్ఎస్ :** కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ కు 2024లో 16.6% ఓట్లు వచ్చాయి ఇప్పుడు 18% కి స్వల్పంగా పెరిగినా, సీటు గెలిచే స్థాయికి అది సరిపోవడం లేదు.

**కాంగ్రెస్ దే జోరు**

తెలంగాణలో బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమించడంతో పోటీ కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారింది. లోక్‌సభ ప్రాతిపదికన సర్వే కాబట్టి ప్రజలు ప్రాంతీయ పార్టీ కంటే జాతీయ పార్టీలకే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఇపుడు కాంగ్రెస్ కూడా తన పట్టును నిలుపుకోవడంతో పాటు పురోగమిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ క్షీణత, జాతీయ సమస్యలపై కాంగ్రెస్ బలమైన పట్టు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలు, జాతీయ స్థాయిలో ఎన్ డిఏ బలం కూడా ఈ సర్వే ఫలితాలపై ప్రభావం చూపుతోంది. ఈ సర్వేలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి మద్దతు ఉందని, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బలహీనపడుతున్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం కష్టమని ఈ అంచనా తెలియజేస్తోంది.

## ఆంధ్రప్రదేశ్‌లో బాబుదే రుబాబు

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 25 లోక్‌సభ స్థానాలకు సంబంధించి (అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత రాజకీయ ట్రెండ్‌లను ప్రతిబింబిస్తూ) ఇండియా టుడే సీ వోటర్ సర్వే ప్రకారం ఎన్డీఏ కూటమికి భారీ ఆధిక్యం ఉంది.

**వోటు షేర్:** ఎన్డీఏకు 55% , వైఎస్సార్ సీపీ కి 39%.

**సీట్ల అంచనా:** మొత్తం 25 స్థానాల్లో ఎన్డీఏకు 2224 సీట్లు, వైఎస్సార్ సీపీకి 13 సీట్లు మాత్రమే.

**కీలక కారణాలు:** ఎన్డీఏ ఐక్యత, ఐక్య కూటమి బలం, వెల్ఫేర్ స్కీమ్‌లు, ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై సానుకూల అభిప్రాయం. 2024 ఎన్నికల్లో ఎన్డీఏకు 21 సీట్లు గెలిచిన నేపథ్యంలో ఇప్పుడు మరింత బలపడింది. ఇది రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి బలమైన మద్దతు ఉందని సూచిస్తుంది. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడం కష్టమని ఈ అంచనా తెలియజేస్తోంది.



## ఒకటో తారీఖు రావాల్సిందే

**కేసీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్**

**హైదరాబాద్, మహా**

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అంతకుముందు శుక్రవారం విచారణకు రావాలని నోటీసులివ్వగా, శుక్రవారం విచారణకు హాజరు కాలేనని కేసీఆర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.



## జజ్జనకర జనారే మేడారం జనహోరే

(మొదటి పేజీ తరువాయి)

దర్శన సమయంలో భక్తుల భద్రతకు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీస్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గద్దెల వద్ద క్యూలు క్రమబద్ధంగా సాగేందుకు వలంటీర్లు సహకరిస్తున్నారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్నారు.

**వేగంగా దర్శనం**

రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. మూడురోజుల్లో దాదాపు 2కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ ఏడాది ప్రభుత్వం, అధికారులు చేసిన అత్యుత్తమ ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనం చాలా వేగంగా జరుగుతోందని భక్తులు తెలిపారు. గతంలో 56 గంటలు పట్టే దర్శనం, ఈసారి కేవలం 2 గంటల్లోనే పూర్తవుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

**భారీగా ట్రాఫిక్ జామ్ లు**

మేడారం జాతరల సమయంలో ట్రాఫిక్ జామ్ లు మామూలే. శుక్రవారం 8కిలోమీటర్ల మేర తాడ్వాయి ప్రాంతంలో ట్రాఫిక్ జాం కాగా, కిలోమీటర్ కే గంటల సమయం పట్టింది. మేడారంకి లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుండటంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతోంది. తాడ్వాయి నుంచి మేడారం మార్గంలో దాదాపు 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుఉతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మేడారం జాతరకు వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉంది. ఏమైనా ఈసారి జాతర ఏర్పాట్లు బాగున్నాయని, తల్లుల దర్శనం బాగా జరుగుతోందని భక్తులు తెలిపారు. శనివారంతో జాతర ముగియనుంది.

# 60 లక్షల కిలోల కల్తీ నెయ్యితో





- **20 కోట్ల లడ్డూలు తయారు చేశారు**
- **వైసీపీ పై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం**
- **హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**తిరుపతి, మహా :**

తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారంపై టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో తిరుమలను ఒక ప్రణాళికాబద్ధమైన కుట్రతో భ్రష్టు పట్టించారని ఆరోపించారు. వైసీపీ నేతలు చేస్తున్న యజ్ఞాలు, ఇస్తున్న క్లీన్ చిట్ ప్రకటనలపై తీవ్రంగా స్పందిస్తూ, హిందూ సమాజానికి జగన్ , ఆయన అనుచరులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ నివేదికలో ఎక్కడా జంతువుల కల్తీ జరగలేదని నిర్ధారించలేదని ఆయన స్పష్టం చేశారు.

**కల్తీ నెయ్యి కొనుగోలు - రూ. 20 కోట్ల లడ్డూల పాపం**

వైసీపీ హయాంలో నిబంధనలను తుంగలో తొక్కి, సామర్థ్యం లేని డైరీలకు టెండర్లు కట్టబెట్టారని నాయుడు ఆరోపించారు. సుమారు 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని కొనుగోలు చేసి, దానితో 20 కోట్ల లడ్డూలను తయారు చేసి పంపిణీ చేశారని అన్నారు. నెయ్యిలో జంతు కొవ్వు లేదని వైసీపీ నేతలు చెబుతుండటం సిగ్గుచేటని, అత్యంత ప్రమాదకరమైన కెమికల్స్ వాడి నెయ్యి తయారు చేశారని సిట్ ఛార్జ్ షీట్ లోనే స్పష్టంగా ఉందని ఆయన గుర్తు చేశారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడి హిందువుల ప్రాణాలతో ఆడుకున్నారని దుయ్యబట్టారు. ఎన్డీడీబీ రిపోర్టులో కొవ్వు ఉందని రిపోర్టు వచ్చింది కాబట్టే సీఎం, మంత్రులు స్పందించారని అన్నారు.

**సిట్ విచారణ , పెద్దల ప్రమేయం**

సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో కొన్ని లోపాలు ఉన్నాయని, కేవలం చిన్న స్థాయి వ్యక్తులపైనే కాకుండా ఈ కుట్ర వెనుక ఉన్న పెద్ద తలకాయలను వెలికితీయాలని బి.ఆర్. నాయుడు డిమాండ్ చేశారు. జగన్, వైవీ సుబ్బారెడ్డిల ప్రమేయం లేకుండా కేవలం పీఏ స్థాయి వ్యక్తులు ఇంత పెద్ద కుంభకోణం చేయలేరని ఆయన అభిప్రాయపడ్డారు. వైవీ సుబ్బారెడ్డి దంపతులు తమ బ్యాంక్ వివరాలను సిట్ కు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నెయ్యి కల్తీపై నూటికి నూరు శాతం నిజం బయటపడాలంటే మైక్రో డీఎన్ఏ టెస్ట్ చేయాలని, ఇందుకోసం కోర్టును ఆశ్రయిస్తామని ఆయన వెల్లడించారు.

**యజ్ఞాలపై ఎద్దేవా - భూమనకు ప్రాణభయం**

మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న యాగంపై బి.ఆర్. నాయుడు సెటైర్లు వేశారు. తప్పు చేసిన వారికి తల వెయ్యి ముక్కలు అవుతుందనే భయం ఉండబట్టే భూమన ఇలాంటి యాగాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని యాగాలు చేసినా చేసిన పాపం పోదని, హిందూ సమాజంపై దాడి చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. తిరుమలను వాటికన్ సిటీలా మార్చాలని చూశారని, భక్తుల రక్షణ కోసం హిందువులందరూ ఏకం కావాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు.

**తిరుమల ప్రక్షాళన**

గత ప్రభుత్వం చేసిన అరాచకాల నుంచి తిరుమలను కాపాడుకోవడమే తమ మొదటి ప్రాధాన్యతని నాయుడు స్పష్టం చేశారు. సిట్ సమర్పించింది కేవలం ప్రాథమిక ఛార్జ్ షీట్ మాత్రమేనని, ముందు ముందు మరిన్ని నిజాలు బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కల్తీకేటుగాళ్లను జైలుకు పంపించే వరకు తాము విశ్రమించబోమని, ప్రతి విషయంలోనూ నిబంధనలను తూట్లు పొడిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



## వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్

**కటించిన రాజమౌళి**

**మహా**

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్‌ఇండియన్ చిత్రం 'వారణాసి' విడుదల తేదీని దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది, అంటే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకుంటూ, "2027... ఏప్రిల్ 7 వారణాశి" అని పోస్ట్ చేశారు. దాదాపు అదే సమయంలో మహేశ్ బాబు కూడా ఇదే పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సినిమా విడుదలపై వస్తున్న అన్ని రకాల ప్రచారాలకు తెరపడినట్లయింది.



## ఓలా ఎలక్ట్రిక్‌లో ఉద్యోగాల కోత

**2025లో 16.1 శాతానికి పడిపోయిన మార్కెట్ వాటా**

**మహా:** ప్రముఖ ఎలక్ట్రిక్ టూవీలర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సుమారు 5 శాతం మందిని తొలగిస్తున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. కంపెనీలో జరుగుతున్న నిర్మాణాత్మక మార్పులు, కార్యకలాపాల్లో ఆటోమేషన్‌ను పెంచడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్లో ఓలా తన ఆధిపత్యాన్ని కోల్పోతున్న తరుణంలో ఈ తొలగింపుల నిర్ణయం వెలువడటం గమనార్హం. 2024లో 36.7 శాతంగా ఉన్న కంపెనీ మార్కెట్ వాటా, 2025 నాటికి అనూహ్యంగా 16.1 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో సంప్రదాయ ఆటో కంపెనీలు ఎలక్ట్రిక్ వాహన విభాగంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకున్నాయి.





## దానం అనర్హత పిటిషన్ పై స్పీకర్ విచారణ

**హైదరాబాద్, మహా :**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ల విచారణను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ వాయిదా వేశారు. బీఆర్ఎస్ నుంచి దానంపై అనర్హత పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పీకర్ కార్యాలయంలో హాజరై తన వాదనలు వినిపించారు. స్పీకర్ ప్రసాద్ వారి నుంచి స్టేట్మెంట్ తీసుకున్నారు. దానం పార్టీ ఫిరాయించారనడానికి ఆయన కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే సాక్ష్యమని, ఆయనపై అనర్హత వేటు వేయాలని కౌశిక్ రెడ్డి స్పీకర్ ను కోరారు. దానం నాగేందర్ తన న్యాయవాదులతో విచారణకు హాజరయ్యారు. బీజేపీ నుంచి అనర్హత పిటిషన్ దాఖలు చేసిన ఏలేటి మహేశ్వ రెడ్డి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేయాలని స్పీకర్ ను కోరారు. దీంతో స్పీకర్ విచారణను ఫిబ్రవరి 18వ తేదీకి వాయిదా వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన 10మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లలో భాగంగా అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్‌గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యదయ్యల పిటిషన్లను విచారించిన స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారు పార్టీలు మారారని నిరూపించడానికి ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంటూ వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన పిటిషన్‌పై విచారణ ముగిసింది. కానీ తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ అనర్హత పిటిషన్ల విచారణ పెండింగ్ లో ఉంది. పెండింగ్ లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై ఇప్పటికే స్పీకర్ ను సుప్రీంకోర్టు వివరణ కోరింది. విచారణ పూర్తి చేసి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించింది.

## ఎన్సీపీ పగ్గాలు చేపట్టనున్న సునేత్ర పవార్

**- నేడు డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం?**

**ముంబై, మహా**

మహారాష్ట్ర దివంగత ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ ఎన్‌సీపీ పగ్గాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. జనవరి 31న ఎన్‌సీపీ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఆమెను తమ నేతగా ఎన్నుకోనున్నట్లు మంత్రి ఛగన్ భుజ్‌బల్ తెలిపారు. ముంబయిలోని పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సునేత్ర పవార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసేందుకు పార్టీలో ఏకాభిప్రాయం ఉందని భుజ్‌బల్ పేర్కొన్నారు. శాసనసభా పక్షం నిర్ణయం తీసుకుంటే, శనివారమే ఆమె ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినా తమకు అభ్యంతరం లేదని సీఎం దేవేంద్ర ఫడణవీస్ చెప్పినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం సునేత్ర పవార్ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. అజిత్ పవార్ మరణంతో బారామతి అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది.





## ..నయా రికార్డ్

(మొదటి పేజీ తరువాయి)

**మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ**

అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై సీఎం శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

**రేపు హైదరాబాద్ కు సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ కు రానుండగా, రాష్ట్రంలోని పాలన, రాజకీయ పరిస్థితులపై మంత్రులు, కీలక అధికారులతో భేటీ కానున్నారు. ఫిబ్రవరి 3నుండి సీఎం జిల్లాల పర్యటనకు బయలుదేరనున్నారు. పదిరోజులు భారత్ లో లేకున్నా.. రాజకీయంగా ఎలాంటి సంచలనాలు, ఆటలు జరగకుండా చూడడం సీఎం రేవంత్ రెడ్డికి పార్టీపై, పాలనపై ఉన్న పట్టుకు నిదర్శనం. విదేశీపర్యటనకు ఎక్కువరోజులు వెళ్తే ఇబ్బందులు వస్తాయని చాలా మంది మూడు, నాలుగురోజులకు మించి టూర్లు పెట్టుకోరు. కానీ సీఎం రేవంత్ రెడ్డి విదేశాలకు వెళ్ళి ఏకంగా ఓ కోర్సునే పూర్తిచేయడం రాజకీయ వ్యూహాలకు, దూకుడుగా నిదర్శనంగా విశ్లేషిస్తున్నారు.

# అభివృద్ధి దిశగా అడుగులు

**ఘనంగా మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుక**

**ముఖ్యఅతిథిగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**





**షాద్ నగర్, మహా :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆలోచన చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజక వర్గంలో అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే ప్రారంభించామని వివరించారు. మా సంకల్పం గొప్పది ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే, అన్ని వనరులు సమకూరితే తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకం ప్రవేశపెడతామని తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు సరైన ఆహారం లేక పరిపూర్ణంగా ఎదగలేక పోతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తుందని తెలిపారు. కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుంది చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయాం అనే భావన కులం, మతం, ధనిక, పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజక వర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే గొప్ప మానవ వనరులు ఉండాలి, మానవ వనరులకు సానపడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుంది అందుకు కావలసింది ఉచితంగా అందరికీ విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వం ప్రధానంగా ఈ రెండు అంశాలపైనే దృష్టి సారించి ముందుకు పోతుందని అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే పాఠశాల నిర్వాహకులు పిలవగానే గత సంవత్సరం జనవరి మాసంలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలకు వచ్చి పది కోట్లు కేటాయించారని వివరించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్ హ రగోపాల్ వంటి అనేకమంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి సమాజానికి అందించిందని తెలిపారు. రాజు దైవంశసంభూతుడు అన్న భావన ఒకవైపు, భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం మరోవైపు కొనసాగుతున్న రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమాలు నడిపించి నిజాం వ్యతిరేక పోరాటం చేసిన గొప్ప నాయకుడు బూర్గుల రామకృష్ణారావు అని తెలిపారు. బూర్గుల మొదట న్యాయవాద వృత్తిని చేపట్టిన తన జీవితం ప్రజల కోసం ఉపయోగపడాలని రాజకీయాల్లోకి వచ్చారని డిప్యూటీ సీఎం తెలిపారు. బిడ్డలు చదువుకుంటే ఉద్యోగాలు, ఉపాధి సాధిస్తారని తల్లిదండ్రులు కూలి నాలి చేసి పంపుతున్నారు తీరా ఉద్యోగం రాకపోతే వారు కూలీలుగా మారిపోతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ తప్పనిసరి అయింది, ప్రపంచం కు గ్రామంగా మారింది, ఇంగ్లీష్ ప్రపంచ భాష అది నేర్చుకుంటేనే ఉపాధి భవిష్యత్తు ఉంటుందని ఆనాడు సభలో తన అనుభవాలను వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రొఫెసర్ హరగోపాల్ విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ బండారి సంతోష జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ..

## సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




**పరిగి మహా :** వికారాబాద్ జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు చేస్తే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు, పోస్టులను ప్రోత్సహించవద్దని సూచించారు. ఏ సమాచారాన్నైనా ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు.

## ఫిబ్రవరి 7 న పరిగికి రానున్న సీఎం రేవంత్ రెడ్డి

**సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**పరిగి, మహా :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 7 న పరిగికి రానున్నారు. మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామ పరిదిలోని నారాయణపూర్ వద్ద జరిగే బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు. సందర్భంగా సభ ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి శుక్రవారం ముందస్తు సమీక్ష నిర్వహించారు. సీఎం సభా స్థలిని స్థానిక డీఎస్పీ డీఎస్పీ శ్రీనివాస్తో కలిసి పరిశీలించారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, జన సమీకరణ, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అధికారులు, నాయకులతో కలిసి చర్చించారు. సీఎం సభకు

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు పాల్గొననున్నట్లు రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయపథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు.

**నామినేషన్లు దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు**

**హాజరైన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్ రెడ్డి**






వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ లను శుక్రవారం దాఖలు చేశారు. 4 వ వార్డు నుండి శివనోళ్ళ చంద్రకళ, 14వ వార్డు నుంచి ఆనెం సరిత నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారులకు అందజేయడం జరిగింది. ఈ మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ విజయ ఢంకా ఖాయమని, ప్రజలు తమకు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి కోరారు.

## ఇదే రాజకీయం

- ఉదయం బీఆర్ఎస్ లో చేరి, రాత్రి కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు
- కోర్టులలో ఓ నేత తీరుపై తీవ్ర చర్చ



**కోరుట్ల, మహా :** ఎన్నికల వేళ జంపింగ్ జపాంగ్‌ల గురించి ఎక్కువగా వినిపిస్తుంటుంది. వీరంతా గోడ మీద పిల్లి లాంటి వారు. ఏ పార్టీ అవకాశం ఇస్తానంటే అటు వైపు వెళ్తారు. కొందరు ఎన్నికల వరకు ఒక పార్టీలో ఉండి, తర్వాత అధికార పార్టీలోకి మారతారు. మరికొందరు టికెట్ కేటాయింపుల్లో తమకు అన్యాయం జరిగితే పార్టీ మారతారు. తాజాగా మునిసిపాలిటీలో కకౌన్సిలర్ టికెట్ కోసం ఒక వ్యక్తి ఒకే రోజు రెండు పార్టీలు మారాడు. ఉదయం కారు పార్టీలో చేరిన వ్యక్తి, రాత్రికి కాంగ్రెస్ గూటికి చేరుకున్నాడు. ఈ ఆసక్తికర సంఘటన జగిత్యాలలో వెలుగు చూసింది. పట్టణానికి చెందిన తోట గంగాధర్ అనే వ్యక్తి 8వ వార్డు నుంచి పోటీ చేయాలని భావించి, గత కొన్ని రోజులుగా ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగాలని భావించిన గంగాధర్, పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే అదే వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మరో వ్యక్తి ప్రయత్నిస్తుండటంతో, తనకు టికెట్ రాదని భావించిన గంగాధర్ గురువారం ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం ఉదయం కోరుట్లలోని గంగాధర్ ఇంటికి వెళ్లి, అతడితో పాటు మద్దతుదారులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంగాధర్ పార్టీ మారిన విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే రంగంలోకి దిగారు. గురువారం రాత్రికి గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి పిలిపించారు. 8వ వార్డు అభ్యర్థిగా టికెట్ అతడికే ఇస్తూ.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రకటన చేశారు. ఆతర్వాత గంగాధర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సంఘటనతో గంగాధర్ ఒక్క రోజులోనే రెండు పార్టీల మారిన నేతగా స్థానికంగా సంచలనం సృష్టించారు.

## ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేయలేదు

**పోలీసులకు క్షమాపణ చెప్పిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**ముగింపు పలకాలని కోరిన ఎమ్మెల్యే**



**హైదరాబాద్, మహా :** పోలీసు ఉన్నతాధికారిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీంతో ఆయనపై వస్తున్న విమర్శలకు వివరణ ఇస్తూ వీడియో విడుదల చేశారు. దీంతో పోలీసులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు కోరారు. కరీంనగర్ సీపీని కులం పేరుతో దూశిస్తూ ఎమ్మెల్యే మాట్లాడారు. దీనిపై తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. పోలీసు అధికారులపై తాను చేసిన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమైనవి కావని పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం వివరణ ఇచ్చారు. ఒకవేళ ఆ మాటల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు చెబుతున్నానని ఆయన ప్రకటించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ వివాదాన్ని కొందరు అనవసరంగా పెద్దది చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదం వెనుక గల కారణాలను వివరిస్తూ.. తాము కుటుంబంతో కలిసి సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్తున్న సమయంలో కొందరు అధికారులు కావాలని తమను అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలో తీవ్రమైన ఒత్తిడి, ఫ్రస్ట్రేషన్ కారణంగానే తన నోరు జారిందని, అంతేకానీ పోలీసు వ్యవస్థ అన్నా, అధికారులన్నా తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే తనపై, తన కుటుంబంపై రాజకీయ దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కొందరు వ్యక్తులు పనిగట్టుకొని ఈ విషయాన్ని తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని, ఈ వివాదాన్ని ఇకపై సాగదీయకుండా ఇంతటితో ముగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత కొద్దిరోజులుగా ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం, పోలీసులు నిరసన తెలపడంతో కౌశిక్ రెడ్డి ఈ మేరకు స్పష్టత ఇచ్చారు.

## కాంగ్రెస్ తరపున యువనేత అందేమోహన్ నామినేషన్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- పట్టణంలో భారీ ర్యాలీ, నినాదాలతో మారుమ్రోగిన ప్రధాన రహదారి



**షాద్ నగర్, మహా :** షాద్ నగర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ తరపున 14వ వార్డు నుంచి యువ నాయకుడు అందేమోహన్ భారీగా తరలివచ్చిన అభిమానులు.. అత్యంత భారీ ఎత్తున ఏర్పాట్లు.. కార్యకర్తల నినాదాలు.. డప్పుల మోతలు.. జాన పద కళాకారుల నృత్యాలు నడుమ కాంగ్రెస్ జెండాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ నామినేషన్ వేశారు. తన వార్డు నుంచి ప్రధాన రహదారుల మీదుగా పెద్ద ఎత్తున ర్యాలీ జరగడం పట్టణవాసులను ఆకట్టుకుంది. కాంగ్రెస్ యువ నేతగా పార్టీలో ప్రస్తుతం చురుకైన పాత్ర నిర్వహిస్తున్న అందె మోహన్ వెంట పెద్ద ఎత్తున యువత, మహిళలు తరలి రావడం విశేషం. భారీ ఎత్తున జనంతో ఎన్నికల కేంద్రం వద్దకు చేరుకున్న అందేమోహన్ అనంతరం తన నామినేషన్ ను అధికారులకు సమర్పించారు. నామినేషన్ అందించగానే నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నేతను ఉత్సాహపరిచారు. షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలలో అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని యువనేత అందమోహన్ అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు సహకారంగా గెలిపించేందుకు ముందుకు వచ్చిన యువకులకు, మహిళలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేసి మున్సిపాలిటీలో ప్రతి వార్డును అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇక్కడ కూడా చైర్మన్ స్థానం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఆ పార్టీని గెలిపిస్తాయని, ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన బీఆర్ఎస్ ఓటమి తథ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## మూడవ రోజు జోరుగా నామినేషన్లు







**అమనగల్లు,మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీకి నిర్వహిస్తున్న ఎన్నికలలో మూడవ రోజు భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. శుక్రవారం మున్సిపాలిటీ లోని 15 వార్డులకు గాను 109నామినేషన్లు దాఖలు అయినట్లు కమిషనర్, జిల్లా ఉప ఎన్నికల అధికారి శంకర్ తెలిపారు. మున్సిపాలిటీకి మూడు రోజుల లో మొత్తం 109నామినేషన్లు దాఖలైనట్లు ఆయన వివరించారు.

## నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**మొయినాబాద్, మహా:** మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ ఎన్నికలకు సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. అనంతరం మూర్తుజగూడ రెవెన్యూ పరిధిలోని మాక్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, సెంటర్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ గౌతమ్ కుమార్, సీఐ పవన్ కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం : వైద్యులు

**అమనగల్లు, మహా:** కుష్ఠు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది కలిసి కుష్ఠు వ్యాధిని సమాజం నుంచి పారద్రోలుతామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, అనుమానం ఉన్నవారు భయపడకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

**- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**మొయినాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిసి చిలుకూరు బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మహమ్మద్ మక్బూల్, నలం ఆంజనేయులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రతి పథకానికి కేంద్రం నుండి నిధులు వస్తున్నాయని, ప్రజలకు రోడ్లు, ఇండ్లు, రైతుల అన్నీ రంగాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. దేశంలో మెజార్టీ మున్సిపల్ కార్పొరేషన్ లు బీజేపీ గెలుచుకుందని, అలాగే తెలంగాణలో కూడా అదే జోరు కొనసాగించాలని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇది వరకు చేవెళ్ల నియోజకవర్గంలో రెండు సర్పంచులతో నేడు 28 పంచాయతీలను బీజేపీ కైవాసం చేసుకుందని, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, గున్నాల గోపాల్ రెడ్డి, చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు గణేష్ కుండే, మోర నరసింహారెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, గున్నాల మల్లారెడ్డి, అత్తపురం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సహదేవ్ గౌడ్, దర్గా నరేందర్, విక్రం రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్,మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**రాజేంద్రనగర్ , మహా ;** శంషాబాద్ సీనియర్ నాయకులు నీరటీ రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి క్రింది 6 లక్షల రూపాయల చెక్కులను వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. హమీదుల నగర్, పాలమాకుల, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, బహదూర్ గూడ, పిల్లని గూడా పెద్ద షాపూర్ తాండ,మల్కారం, గ్రామాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి ఒక వరం లాంటిది దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి చిలకమర్రి. మహేందర్ ముదిరాజ్, సర్పంచులు కోటేశ్వర్ గౌడ్, నరసింహ, రవి నాయక్, వట్టెల సతీష్ యాదవ్ ,నరసింహ, శ్రీశైలం, గూడెప్ కుమార్, వివిధ గ్రామాల వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, సారా జంగయ్య గౌడ్, జర్కి రమేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హాస్పిటల్ ఈవో బిల్డింగ్స్ నిధులు మంజూరు చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో శుక్రవారం పాలమాకుల సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ గూడపు కుమార్, వార్డు సభ్యులు బుతులు బేగం, బుద్ధం నీరజ, సారా రాకేష్, పోచన్న సంధ్య, తుమ్మల సుమలత, అజయ్ కుమార, బద్రిపల్లి ప్రవీణ్, మల్లెల నర్సింగ్ రావు, కుమ్మరి చంద్రశేఖర్, అర్చన, సుక్క ప్రేమ్ కుమార, శంకర్, శివరాం శంషాబాద్ మండలం మైనార్టీ ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్, శంషాబాద్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, మండల్ ట్రెజర్ ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాలమకుల గ్రామ ప్రజలు తదయ పాల్గొన్నారు.

## పాలకులుగా కాదు, ప్రజా సేవకులుగా పనిచేస్తాం



**అమనగల్లు, మహా :** ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని, మున్సిపల్ ఎన్నికల్లో బీ ఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్య నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థుల తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కాదు పనులు చేస్తోంది. రైతు నుంచి మహిళ, యువత నుంచి పేదల వరకు ప్రతి వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన సాగిస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలోని శ్రీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండేళ్ల ప్రజా పాలనలో అన్ని వర్గాలు కూడా సంతృప్తిగా ఉన్నాయని అన్నారు. ఆమనగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నా రని,నాలుగు మండలాల కూడలి అయిన , ప్రభుత్వ కార్యాలయ ఏర్పాటుకు, ప్రభుత్వ కాలేజీ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ రాములు,నాయకులు గుర్రం కేశవులు, జగన్,కృష్ణ నాయక్, మానయ్య,మహేష్, అలీమ్, కౌన్సిలర్ అభ్యర్థులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్

'వారణాసి' విడుదల తేదీపై క్లారిటీ వచ్చింది. 2027 ఏప్రిల్ 7న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు దర్శకుడు రాజమౌళి ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్టు రిలీజ్ డేట్ కోసం సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 2027 ఏప్రిల్ 7వ తేదీతో కూడిన హోర్డింగులు వారణాసిలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో 'ఇది వారణాసి విడుదల తేదీనే', 'రాజమౌళి విభిన్న ప్రమోషన్స్' అంటూ ఎక్స్ లో చర్చ జరిగింది. ఈ సినిమా గ్లింప్స్ ఈవెంట్లో 2027 వేసవికి విడుదల అని చిత్ర బృందం అని చెప్పడంతో.. అభిమానులు ఏప్రిల్ 7ని ఫిక్స్ అయిపోయారు. తాజాగా రాజమౌళి దానిని ఖరారు చేశారు. వరుస సెలవుల నేపథ్యంలో: ఉగాది, గుడిపడ్వాని పురస్కరించుకుని 2027 ఏప్రిల్ 7వ తేదీన (బుధవారం) సినిమాను విడుదల చేయనుండటం గమనార్హం. ఆ తర్వాతా వరుస సెలవులు రానున్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి, 15న శ్రీరామ నవమి. తమిళ సంవత్సరాదినీ అదే సమయంలో జరుపుకోనున్నారు.




EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034